సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 30 । జనవరి । 2025



నిబంధనలకు తూట్లు..

అరసవల్లి ఆదిత్యాలయంలో కొందరు ఉద్యోగులు కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమాలకు తెరలేపారు. నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు.

- 8లో



సంకల్పానికి సలాం..!

ఆమదాలవలస పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపారులు పేదల ఆకలి తీరుస్తున్నారు. నిర్విరామంగా ఏడాది పాటు నిత్యాన్నదానం చేస్తున్నారు.

- 8లో

వర్సిటీలో జీతాల పెంపు

ఎచ్చెర్ల క్యాంపస్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బందికి వేతనం పెంచుతూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వచ్చే నెల నుంచి పెంపు అమలు చేయనున్నట్లు సమాచారం. నాన్ టీచింగ్‌లో కాంట్రాక్ట్ సిబ్బందికి రూ.3000, ఆఫీస్ సబార్డినేట్ స్థాయి సిబ్బందికి రూ.1500 చొప్పున పెంచారు. వర్సిటీ అధికారులు ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు సమాచారం.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్ర(శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలు) ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలకు ఎన్నికల కమిషన్ బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. రాష్ట్రంలో మూడు నియోజకవర్గాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనుండగా అందులో ఉత్తరాంధ్ర ఒకటి. ప్రస్తుతం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పాకలపాటి రఘువర్మ ఉన్నారు. ఈయన పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. బుధవారం ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన నాటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

నోటిఫికేషన్: 2025 ఫిబ్రవరి 3
నామినేషన్లు చివరితేదీ: ఫిబ్రవరి 10
నామినేషన్ల పరిశీలన: ఫిబ్రవరి 11
నామినేషన్ల ఉపసంహరణ: ఫిబ్రవరి 13
పోలింగ్: ఫిబ్రవరి 27(ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు)
లెక్కింపు: మార్చి 3

కుంభమేళాకు ప్రత్యేక బస్సులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్, డిపోమేనేజర్లు

శ్రీకాకుళం అర్బన్ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 8వ తేదీ రాత్రి 8 గంటలకు శ్రీకాకుళం బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి మార్గమధ్యలో పూరీ జగన్నాథ ఆలయం, కోణార్క్ సూర్య దేవాలయం, భువనేశ్వర్ లింగరాజ్ ఆలయ దర్శనం అనంతరం ప్రయాగ్‌రాజ్ చేరుకుంటుందని చెప్పారు. అక్కడ పుణ్యస్నానం తర్వాత తిరుగు ప్రయాణంలో కాశీ, గయ, బుద్ధగయ దర్శింప చేసి శుక్రవారం రాత్రికి శ్రీకాకుళం చేరుతుందని తెలిపారు. ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఉంటుందని పేర్కొన్నారు. 7 రోజుల్లో 7 క్షేత్రాల దర్శనం నిమిత్తం భోజన సౌకర్యంతో కలిపి ఒకరికి రూ.9500గా టికెట్ ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్టీసీ 1–2వ డిపో మేనేజర్లు, హనుమంతు అమరసింహుడు, రవి శంకర్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 99592 25608, 99592 25609 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



విద్యార్థినులను అభినందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారిణులు సింగూరు నందిని, ముంత గాయిత్రి, బెండి జ్యోత్స్నలను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అభినందించారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఈ నెల 7 నుంచి 21 వరకు పోటీలు జరగ్గా.. ఆంధ్రప్రదేశ్ ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఆ జట్టులో సభ్యులుగా మన విద్యార్థినులుండటంతో ఎస్పీ బుధవారం వారిని పిలిపించి ప్రశంసాపత్రాలు, మెమెంటోలతో సత్కరించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యువాత



బుడగుట్లపాలెం తీరంలో ఆలివ్ రిడ్లే కళేబరం

ఎచ్చెర్ల క్యాంపస్: ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు కలకలం సృష్టిస్తున్నాయి. వాతావరణ కాలుష్యం, ఇతరత్రా కారణాల వల్ల మృతి చెందిన తాబేళ్లు ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెం తీరానికి కొట్టుకొస్తున్నాయి. దీంతో పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు.

టెక్కలి మేజర్ పంచాయతీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రంలో కానరాని ఎరువుల తయారీ



చెత్తశుద్ధిపై ఉందా చిత్తశుద్ధి..?

- జిల్లాలో అస్తవ్యస్తంగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు
- కూటమి ప్రభుత్వం వచ్చాక చెత్తపై చిత్తశుద్ధి లోపం



వజ్రపుకొత్తూరు: హుకుంపేటలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం దుస్థితి

అరసవల్లి:

పల్లెల్లో ఘన వ్యర్థ పదార్థాల సంపద కేంద్రాలు(ఎస్‌డబ్ల్యూపీసీ) నామమాత్రంగా మిగిలిపోతున్నాయి. చెత్త నుంచి సంపద కేంద్రాలని పిలుచుకునే ఈ కేంద్రాలపై సర్కారుకు చిత్తశుద్ధి లేకపోవడం వల్ల లక్ష్యానికి దూరంగా ఉండిపోతున్నాయి. జిల్లాలో మొత్తం 912 పంచాయతీల్లో మొత్తం 690 పంచాయతీల్లో ఈ కేంద్రాల నిర్మాణాలు జరిగాయి. సుమారు 219 చోట్ల అసంపూర్తిగా నిర్మాణాలున్నాయి. గత ప్రభుత్వ హయాంలోనే అత్యధికంగా నిర్మాణాలు జరిగాయి. అప్పట్లో ఒక ఏడాదిలోనే గరిష్టంగా వర్మీ కంపోస్టు ఉత్పత్తి ద్వారా రూ.6.55 లక్షల వరకు ఆదాయం సమకూరగా, పొడి చెత్తతోనే రూ.5.81 లక్షల వరకు ఆదాయం లభించింది. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడు నెలల వరకు వర్మీ కంపోస్టు తయారీ అతి తక్కువ మోతాదులోనే చేయగలిగారు. వీటి ద్వారా ఆదాయం రూ.పదివేలకు కూడా చేరలేదనే సమాచారం. దీన్ని బట్టి జిల్లాలో అధికారుల పర్యవేక్షణ లోపం, పాలకుల చిత్తశుద్ధి ఎంత ఉందో అర్థమవుతుంది.

జిల్లాలో మొత్తం 30 మండలాల్లోని 912 గ్రామ పంచాయతీల్లో 690 చోట్ల ఈ నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే మండలానికి గరిష్టంగా 5 షెడ్లలోనే పూర్తి స్థాయిలో వర్మీ జనరేషన్ జరుగుతున్నట్లుగా అధికారిక సమాచారం. దీన్ని బట్టి కేవలం 150 చోట్ల మాత్రమే వర్మీ కంపోస్టు జరుగుతున్నట్లుగా చెప్పవచ్చు. దీంతో పెద్దగా ఆదాయం రావడం లేదని అధికారులు గుర్తించారు. దీంతో పాటు చాలా చోట్ల షెడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోయాయి. ఇదిలావుంటే పోలీసులు కూడా చాలా చోట్ల ఈ షెడ్ల వద్దనే పేకాట, మందుబాబులను పట్టుకున్న సందర్భాలు బోలెడు ఉన్నాయి. వీటి పర్యవేక్షణ బాధ్యతలన్నీ మండలాల అభివృద్ధి అధికారులపై ఉండగా.. జిల్లా పంచాయతీల వనరుల కేంద్రం (డీపీఆర్‌సీ) ఆధ్వర్యంలో వీటి నిర్వహణ అమలు బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంది. అయితే పర్యవేక్షణ లోపం కారణంగా కేంద్రాలు కునారిల్లిపోతున్నాయి.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా..



కంచిలి: అంపురం కేంద్రంలో మద్యం బాటిళ్లు



ఆమదాలవలస: గాజులకొల్లివలస పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న కంపోస్టు షెడ్డు



ఎచ్చెర్ల క్యాంపస్ : ఎస్.ఎం.పురం కేంద్రంలో ఖాళీ మద్యం బాటిళ్లు

మార్చి నెలాఖరు నాటికి అందుబాటులోకి..

"జిల్లాలో చాలా పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు పాడైపోయాయి. అలాగే చాలా చోట్ల అసంపూర్తిగా షెడ్ల నిర్మాణాలు జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు మేరకు ఈ షెడ్ల వద్ద మరమ్మతుల పనులన్నీ ఈ మార్చి 31లోగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని చర్యలు చేపడుతున్నాం. అలాగే వర్మీ కంపోస్టును తయారీ చేసే విషయంలోనూ ప్రాధాన్యతగా పర్యవేక్షిస్తున్నాం."

– కె.నిశ్చల, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్



గార: శ్రీకూర్మం చెత్త సంపద కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న యంత్రాలు



పాతపట్నం: పాతపట్నం ఆల్‌ఆంధ్రరోడ్డు పక్కన చెత్త లేని చెత్త సంపద తయారీ కేంద్రం

జిల్లా.. జూదగాళ్ల ఖిల్లా..!



- జిల్లాలో ఎక్కడికక్కడ పేకాట డెన్‌లు
- కీలక వ్యక్తులు, రౌడీషీటర్లు, మాజీ రౌడీషీటర్ల ఆధ్వర్యంలో నిర్వహణ
- ఒడిశాకు సైతం జూదగాళ్లను తీసుకెళ్తున్న కొన్ని ముఠాలు
- మార్గమధ్యలో పట్టుబడకుండా ఎక్కడికక్కడ ముడుపులు
- ఎస్పీ టాస్క్‌ఫోర్స్‌కు పెద్ద ఎత్తున పట్టుబడుతున్న జూదగాళ్లు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో జూదం జూలు విదుల్చుతోంది. పేకాట రూపంలో రోజుకు రూ.కోట్లలో చేతులు మారుతోంది. ఆదివారం, ఇతరత్రా సెలవు దినాల్లో అది తారస్థాయికి చేరుతోంది. జిల్లాలో అనేక ప్రాంతాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకూ ఆట సాగుతోంది. వీటిలో అత్యధిక చోట్ల నేతల ప్రత్యక్ష ప్రమేయం ఉండగా, కొన్నిచోట్ల పోలీసుల లాలూచీ వ్యవహారం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. అనుమానం రాకుండా అడపాదడపా దాడులతో చేతులు దులుపుకుంటున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో కొందరు రూ.లక్షలు గడిస్తుండగా, మరికొందరు పచ్చని కాపురాలను గుల్ల చేసుకుంటున్నారు.

కాదేదీ డెన్‌కు అనర్హం..

పట్టణ ప్రాంతాల్లో లాడ్జీలు, అపార్ట్‌మెంట్, శివారు కాలనీలు.. గ్రామీణ ప్రాంతాల్లో పొలాలు, తోటలు, ఫామ్‌హౌస్‌లు, పారిశ్రామిక భవనాలు, డెన్‌లుగా మార్చుకుంటున్నారు.

- జలుమూరు పోలీసుస్టేషన్ పరిధిలో లుంగీబ్యాచ్ పేకాట డెన్‌లకు పేరుగాంచింది. తులసీ, శ్రీను తదితర బ్యాచ్‌లైతే ఒడిశాలో పర్మినెంట్ స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు.
- శ్రీకాకుళం నగర శివార్లలో కొన్ని ఫామ్‌హౌస్‌లు పేకాటకు చిరునామాలుగా చెబుతుంటారు.
- ఎల్‌బీఎస్ కాలనీకి చెందిన నవీన్ అనే వ్యక్తి నగరంలోని ఓ వీధిలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పెట్టుకుని పేకాట, బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ఉదయం 11గంటలకు సమావేశమై ఫుడ్ రెడీ చేసుకుని శ్రీకాకుళం శివారు ప్రాంతాలైన బొంతల కోడూరు, కిల్లిపాలెం, గనగళ్లపేటలో ఆడిస్తున్నట్టు సమాచారం. కార్లలోనే పేకాడించడం ఈయన స్పెషల్. గతంలో ఒకసారి బొంతలకోడూరులో పోలీసులు పట్టుకున్నా వెనక్కి తగ్గడం లేదు.

ఈ ప్రాంతాల్లో నిత్యకృత్యం..

పోలీసులు పట్టుకున్న సొమ్మును ఒక్కొక్కరికీ మినిమంగా రూ.వెయ్యి, అంతకంటే కాస్త ఎక్కువగా చూపిస్తున్నా అధిక మొత్తంలో నగదును, ఆడేవారిని కేసుల నుంచి తప్పిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలో బలగ, వంశధార కార్యాలయం సమీప పాత భవనాలు, డచ్‌బంగ్లా సమీప ప్రాంతాలు, పాడుబడిన భవనాల్లో పేకాట నిత్యకృత్యంగా మారింది. ఒక రోజు ఆడిన ప్రాంతంలో మరో రోజు ఆడటం లేదు. టూ టౌన్ పరిధిలోని ఒక లాడ్జీలో కొన్నేళ్లుగా పేకాట సాగుతోంది. అరసవల్లి దగ్గరలో ఓ హోటల్‌లో కూడా పేకాట సర్వసాధారణమైపోయింది. సదరు యజమానికి పెద్దల అండదండలుండటమే కారణంగా తెలుస్తోంది.

- గార మండలం ఒప్పంగి, శ్రీకూర్మం, గారలో ఒక వ్యక్తి సిండికేట్ నడుపుతుంటాడని, ఈయన వెనుక పెద్దలు, రౌడీషీటర్లు, వాటాదారులు ఉన్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసి పోలీసు ఉన్నతాధికారులు ముగ్గురు కానిస్టేబుళ్లను వేరే చోటకు మార్చేశారన్న వాదనలు ఉన్నాయి. ఒప్పంగి గ్రామంలో ఓ తోటలో నిత్యం పేకాట జరుగుతుందనే ప్రచారం ఉంది.
- ఆమదాలవలస మండలం తోటాడ, ఊసవానిపేట, గాజులకొల్లివలస సంగమేశ్వర కోవెల సమీపంలో, దన్నానపేట పాండవుల మెట్ట సమీపంలో, నిమ్మతొర్లివాడ తోటల్లో, మిన్నయ్య పేట, చింతాడ నందగిరిపేటల్లో పేకాట శిబిరాలు నడుస్తున్నాయి.
- ఎచ్చెర్ల మండలంలో నెలలో ఒకట్రెండు కేసులు రూ.30 వేలు నుంచి రూ. లక్ష లోపు అమౌంట్‌తో పట్టుబడినవి ఉంటున్నాయి. ఇందులో పట్టుబడినవారు పేకాట వ్యసనానికి అలవాటు పడి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ మోటార్లలోని కాపర్ కాయిల్స్ వంటివి చోరీలు చేస్తున్నారు. అప్పుడప్పుడు బడా నేతలు తమ తమ గెస్ట్‌హౌస్‌ల్లో రాజకీయాలకతీతంగా రూ.లక్షల్లో ఆడుతుంటారని సమాచారం. ఈ క్రమంలోనే కొద్దిరోజుల క్రితం జనసేన నాయకుడు గెస్ట్‌హౌస్‌లో ఆడి అంతా పట్టుబడ్డారు. తమ్మినాయుడు పేటలో ఒక యువకుడు నిత్యం పేకాట ఆడిస్తుంటాడు. కుశాలపురం, ఫరీద్ పేటల్లో ఎక్కువగా గేమింగ్ జరుగుతుంటుంది.
- జె.ఆర్.పురం పీఎస్ పరిధిలో వ్యవహారం వేరు. పేకాట ఆడేవారికంటే ఆశ్రయమిచ్చేవారే ఇక్కడ ఎక్కువ. వైజాగ్, భోగాపురం నుంచి వచ్చేవారు నారువ, అక్కయ్యపాలెం, పైడి భీమవరంలోని శివారు ప్రాంతాల్లోని తోటల్లో రూ.లక్షల్లో ఆడుతున్నారు. గతంలో రూ.9 లక్షలతో కొందరు పట్టుబడగా, ఏడెనిమిది కార్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- పలాస, కాశీబుగ్గ రిజర్వు ఫారెస్టు తోటలు, వజ్రపుకొత్తూరు మండలం శివసాగరం బీచ్ ఏరియా, బెండి కొండ తోటలు, కాశీబుగ్గలోని నెమలికొండ, సూదికొండ, పాడుబడిన హుదూద్ ఇళ్లల్లో పేకాట శిబిరాలు జరిగాయి.
- టెక్కలి నియోజకవర్గ పరిధిలో కూడా పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. ఇటీవల టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్న వారి పేర్లు తప్పించాలని అక్కడి అధికార పార్టీ నాయకులు పోలీసు ఉన్నతాధికారిపై ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది.
- ఇచ్ఛాపురం సరిహద్దులోని చీకటిపేట ఏరియాల్లో పెద్ద ఎత్తున పేకాట శిబిరాలు నడుస్తున్నాయి.

రూ.లక్ష నుంచి మొదలు..

జిల్లా కేంద్రంలో రౌడీషీటర్లు, మాజీ రౌడీషీటర్లు ఆధ్వర్యంలో శిబిరాలు నడుస్తున్నాయి. ఈ నెల 19న హయాతినగరంలో 12 మంది రూ.11.13 లక్షలతో పట్టుబడినట్లు పోలీసులు పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో కిరణ్ అనే కీలక వ్యక్తే కాకుండా తప్పించుకున్నవారిలో టీడీపీ నేత ఉన్నారన్న సమాచారం ఉంది. ఎవరి 'ప్రతాప'మో తెలియదు గాని చాకచక్యంగా తప్పించుకున్నాడు. ఇక్కడ ఒక్కో మనిషికి కనీసం రూ.లక్షతో ఆటను స్టార్ట్ చేసినట్టు సమాచారం. కోట్లలో ఆట జరిగినట్టు తెలిసింది. అదే రోజు రాత్రి 12 దాటాక టాస్క్‌ఫోర్స్‌కు ఎనిమిది మందిని రూ.36 వేలతో పట్టుబడినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ నెల 18న ఖాజీపేట కాలనీ గెడ్డ గట్టు వద్ద, వాంబేకాలనీ రాజీవ్‌గృహకల్ప సమీపంలో 13 మంది రూ.13వేలతో పట్టుబడ్డారు. ఈ నెల 7న డైమండ్ పార్కులో నలుగురు రూ.9 వేలతో పట్టుబడ్డారు.



ఒడిశాలో ప్రత్యేక శిబిరాలు..

ఎక్కువ మొత్తం డబ్బులతో పేకాట ఆడేవారిని ఒడిశాలోని అక్కడి శిబిరాలు వద్దకు తీసుకెళ్తుంటారు. సొంతంగా కార్లు పెట్టడం, దారి పొడవునా మామూళ్లు ఇవ్వడం పరిపాటి. ఒడిశాలోని గారబంద మార్గంలో పేకాట శిబిరం నిత్యం నడుస్తోంది. నకిలీ నోట్ల కుంభకోణంలో దొరికిన ముఠాకు, ఇక్కడ మూడు చోట్ల పేకాట శిబిరాలు నిర్వహిస్తున్న కూర్మ, గోపి, తేజ, తులసీలకు సంబంధం ఉన్నట్టు సమాచారం.

ఎస్పీకి అనుమానం వచ్చిందేమో..

జిల్లాలో జరుగుతున్న పేకాట శిబిరాలపై సరైన చర్యలు తీసుకోవడం లేదనో మరేంటో తెలియదు గానీ స్థానిక పోలీసు స్టేషన్లకు సమాంతరంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఎస్పీ మహేశ్వరరెడ్డి ఏర్పాటు చేశారు. అప్పటి నుంచే దాడులు ముమ్మరమయ్యాయి. టాస్క్‌ఫోర్స్‌కు దొరికినప్పుడు ఆయా పోలీసు స్టేషన్ సిబ్బందికి ఎందుకు పట్టుబడటం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

టాస్క్‌ఫోర్స్‌కు పట్టుబడిన పిక్కాట బ్యాచ్

- రూ.3లక్షలకు పైగా నగదు స్వాధీనం
- 19 మందిపై కేసు నమోదు

సారవకోట: మండలంలోని తొగిరి గ్రామంలో మంగళవారం రాత్రి పిక్కాట, చక్రం తిప్పే ఆటలో పట్టుబడిన 19 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని యాత్ర జరుగుతుండగా నిబంధనలకు విరుద్ధంగా ఈ శిబిరాలు ఏర్పాటు చేశారని చెప్పారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి చక్రం తిప్పే ఆటలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వీరి వద్ద నుంచి రూ.76,915 నగదు, పిక్కాట ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ 2,24,210 నగదు స్వాధీనం చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు రణస్థలం బంద్

- ఫ్లై ఓవర్ నిర్మాణంపై నిరసన
- సమాచారం ఇవ్వకుండానే పనులు చేపడుతుండటంపై మండిపాటు



నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

రణస్థలం: గ్రామస్తులకు, వ్యాపారులకు కనీస సమాచారం ఇవ్వకుండా రణస్థలం పట్టణంలో ఫ్లై ఓవర్ పనులను రెవెన్యూ, హైవే అధికారులు ప్రారంభించడాన్ని నిరసనగా వ్యాపారులు గురువారం స్వచ్ఛంద బంద్‌కు పిలుపునిచ్చారని ఫ్లైఓవర్ వ్యతిరేక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలి వద్ద రణస్థలం, జె.ఆర్.పురం గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. హైవే అధికారులు మార్కింగ్ వేసి ఇష్టారాజ్యంగా సర్వేలు చేపడుతున్నారని, ప్రాజెక్టు వివరాలు బహిర్గతం చేయకుండా పనులు ప్రారంభించడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నించారు. గురువారం జరిగే బంద్‌లో అన్ని వర్గాలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

ముసుగు తీసిన మోసగాడు చంద్రబాబు

- అచ్చెన్నాయుడివి డైవర్షన్ పాలిటిక్స్
- ఏడాది కాకముందే కూటమి ప్రభుత్వం పనైపోయింది
- విలేకరులతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

కాశీబుగ్గ: ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి బూటకపు హామీలతో గద్దెనెక్కిన మోసగాడు నారా చంద్రబాబునాయుడు ఎట్టకేలకు ముసుగు మొత్తం తీసేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. పలాసలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్‌తో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఏ హామీలైతేనైతే అధికారంలోకి వచ్చారో నేడు వాటిని నెరవేర్చలేమని నిస్సిగ్గుగా ప్రకటించి ప్రజలను దగా చేశారని ధ్వజమెత్తారు. సాక్షాత్తూ సచివాలయంలోనే ఈ ప్రకటన చేయడం చంద్రబాబు మార్కు దగాకు రుజువని దుయ్యబట్టారు. కూటమి ఎమ్మెల్యేలు గ్రామాల్లోకి వెళ్లాలంటే సంకోచించే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. చంద్రబాబు ప్రకటనతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా మంత్రి అచ్చెన్నాయుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల చౌకబారు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏడాది కాకముందే కూటమి ప్రభుత్వం పనైపోయిందని ఎద్దేవా చేశారు. కోవిడ్ వంటి కష్టకాలంలో కూడా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంక్షేమ పథకాలు అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు.

– మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే చంద్రముఖిని మళ్లీ లేపినట్టేనని, పులినోట్లో తల పెట్టడమేనని తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో చేసిన హెచ్చరికలు మరోసారి రుజువయ్యాయన్నారు. జగన్ విశ్వసనీయత, చిత్తశుద్ధి, సంకల్పం మరోసారి అందరూ గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. కూటమి పాలనలో తొమ్మిది నెలల్లోనే దాదాపు రూ.1.19 లక్షల కోట్లు అప్పులు తీసుకొచ్చారని, ఎంత సంపద సృష్టించారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పైల చిట్టి, పలాస కాశీబుగ్గ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణ, కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సంపత్‌రావు, హేమసుందర్‌రాజు, పలాస మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, టెక్కలి నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు పి.వెంకటరమణ, సీనియర్ నేత బడగల బాలచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



పలాసలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, పేరాడ తిలక్ తదితరులు

క్లుప్తంగా

పుస్తకాలు వితరణ

ఎచ్చెర్ల క్యాంపస్: సోంపేట మండలంలోని బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జల్లు సుబ్బారావు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం గ్రంథాలయానికి పుస్తకాలు వితరణగా అందజేశారు. సుమారు రూ.50 వేలు విలువ చేసే సాహిత్య, అనువాద, తెలుగు భాషకు సంబంధించిన పుస్తకాలు వీసీ రజినికి అందించారు. విద్యార్థులకు అకడమిక్‌గా, పరిశోధనలకు ఈ పుస్తకాలు ఉపయోగపడతాయని తెలిపారు.

29ఈటీఎల్26: వీసీ రజినికి పుస్తకాలు అందజేస్తున్న విశ్రాంత ప్రిన్సిపాల్ సుబ్బారావు

కుక్కల దాడిలో మేక పిల్లలు మృతి



మృతి చెందిన మేక పిల్లలు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని తామాడలో వీధి కుక్కల దాడిలో ఆరు మేక పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన పాసి రాము మేకల పెంపకం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటి పక్కన కంచెవేసి అందులో మేక పిల్లలను పెంచుతున్నాడు. కాగా ఆ మేక పిల్లలపై బుధవారం తెల్లవారుజామున గ్రామంలోని కుక్కలు దాడి చేశాయి. దీంతో ఆరు మేక పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని, బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామ వీధుల్లో కుక్కలు పెద్ద సంఖ్యలో సంచరిస్తున్నా, పంచాయితీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయ విద్యా సదస్సుకు ఆహ్వానం



ముద్దాడ బాలరాజు

హిరమండలం: మండలంలోని దుర్బలాపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ముద్దాడ బాలరాజుకు జాతీయ విద్యా సదస్సుకు ఆహ్వానం అందినట్లు బుధవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ఫిబ్రవరి 9వ తేదీన ఢిల్లీలో జరగనున్న నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎడ్యుకేషన్ అండ్ ఈ–లెర్నింగ్ సదస్సులో పాల్గొని ప్రస్తుత విద్యావిధానాలు, విద్యా విధానంలో నూతన పోకడలు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఈ–లెర్నింగ్ ఆవశ్యకతపై ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుడిగా, పెడగాజికల్ అనలిస్ట్‌గా సేవలందిస్తూ, పోటీ పరీక్షలకు సంబంధించిన కొన్ని కాంపిటేటివ్ పుస్తకాలను సైతం రచించిన బాలరాజు జాతీయ స్థాయి సదస్సుకు హాజరు కానుండడంపై ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

సామాజిక ఆస్పత్రి తనిఖీ



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: కోటబొమ్మాళి సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిని మంత్రి అచ్చెన్నాయుడు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పలు విభాగాలను పరిశీలించి వైద్య సేవలపై రోగులతో మాట్లాడారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చినవారికి మెరుగైన వైద్యం అందజేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఆ నేత్రాలు సజీవం



రమణమూర్తి(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో ఫాజుల్‌బాగ్‌పేటలోని దేవాంగుల వీధిలో నివాసముంటున్న జామి రమణమూర్తి జయరాం(62) అనారోగ్యంతో మృతి చెందారు. అయితే మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులు శిల్లా మణి, భార్య కామేశ్వరి, కుమారుడు నవీన్, కోడలు గౌతమిలు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. దీంతో నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి పి.సుజాత, సహాయకుడు నంది ఉమాశంకర్‌లు వచ్చి కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, సభ్యులు దుర్గా, శ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 78426 99321 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

సంకల్పానికి సలాం..!



ఏ జన్మ బంధమోగానీ.. వారంతా ఆకలితో అలమటించే కడుపులకు ఆసరాగా నిలిచారు. అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని పెద్దలంటారు. అన్నార్తుల ఆకలి తీర్చడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తారు. అలాంటి బృహత్తర కార్యాన్ని ఏడాది పాటు నిర్విరామంగా నిర్వహిస్తూ శభాష్ అనిపించుకున్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టాలని వారి మదిలో మెదిలిన ఆలోచనను ఏడాది క్రితం ఆచరణలో పెట్టారు. దీనికోసం ప్రత్యేకంగా దాతలను అభ్యర్థించలేదు. సంకల్పం మంచిదైతే అందుకు తగ్గట్టుగానే ప్రజలు స్పందిస్తారని నమ్మారు. వారి నమ్మకం నిజమైంది. వారి ఆలోచనకు ప్రజల సహకారం తోడైంది. ఫలితంగా తొలి ఏడాది ఎంతోమంది ఆకలి తీర్చి ఎందరికో మార్గదర్శమయ్యారు.

– ఆమదాలవలస

- నిర్విరామంగా ఏడాది పాటు నిత్యాన్నదానం
- ఐదుగురి ఆశయానికి దాతల సహకారం
- మరో ఏడాది కొనసాగించేందుకు సన్నద్ధం

ఆమదాలవలస పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపారులు గుడ్ల అప్పల నరసయ్య, బగాది భాస్కరరావు, దుంపల శ్యామలరావు, ఊన్న రమేష్, గొండు రవిలు తరుచూ కలుస్తూ ఉంటారు. వీరంతా కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో ఆకలితో అలమటించిన ఎంతోమందిని చూసి చలించిపోయారు. దీంతో కష్టకాలంలో పేదలకు తోడ్పాటు అందించాలని సంకల్పించారు. దీనిలో భాగంగా కరోనా సమయంలో దాదాపు ఏడాది పాటు రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో పేదలకు మధ్యాహ్న భోజనాన్ని అందజేశారు. అలాగే పట్టణంలో ఎవరైనా కరోనా బాధితులు ఉంటే వారికి సైతం భోజనాన్ని అందించి సేవాగుణం చాటుకున్నారు.

ఆకలి తీర్చడంలో ఆనందం

కరోనా అనంతరం వీరి సేవలు నిలిచిపోయాయి. అయితే అన్నార్తులకు ఆకలి తీర్చడంలో ఉండే సంతోషంతో తమ సేవలను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. దీనిలో భాగంగా ప్రతిరోజూ సొంత డబ్బులతో సుమారు 30 మందికి తగ్గకుండా పేదలకు మధ్యాహ్నం భోజనం అందించేందుకు ముందుకు వచ్చారు. సరిగా ఏడాది క్రితం ఆమదాలవలస పట్టణంలోని శ్రీరామ మందిరం–శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాల ప్రాంగణంలో అన్నపూర్ణేశ్వరి దేవి నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. తొలుత ఐదుగురే ప్రారంభించిన ఈ కార్యక్రమానికి క్రమేపీ మంచి గుర్తింపు లభించింది. వీరి సంకల్పానికి దాతలు తోడయ్యారు. పెళ్లిరోజు, పుట్టినరోజు, వర్ధంతి రోజుల్లో దాతలు పేదలకు అన్నదానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. దాతలు లేని రోజుల్లో కమిటీ వారు పేదలకు అన్నదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని దేవుడి ఆశీస్సులతో, ప్రజలందరి సహకారంతో నిరంతరంగా కొనసాగించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని కమిటీ సభ్యులు చెప్పడం విశేషం. 365 రోజులు పూర్తయిన సందర్భంగా నిత్యం భోజనాలు చేసే పేదలతోపాటు మరికొందరికి ఒక నెల రోజులకు సరిపోయే నిత్యావసర సరుకులు వితరణగా అందజేశారు.

కరోనాలో ముందుకొచ్చాం



కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఆలయాల వద్ద ఉండే పేదలు ఆకలితో అలమటించారు. పట్టెడన్నం కోసం ఎదురు చూశారు. ఆ దృశ్యాలు నన్ను కలిచివేశాయి. దీంతో మిత్రుల సాయంతో కరోనా సమయంలో ముందుకొచ్చి పేదలకు మధ్యాహ్న భోజనం కొంతకాలం అందించాం. అనంతరం పేదలకు నిరంతరం అన్నదానం చేయాలని తలచి, నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించాం.

– గుడ్ల అప్పల నరసయ్య, ఆమదాలవలస



పేదలకు అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

దాతల సహకారం బాగుంది



పేదలకు నిత్యం అన్నదానం చేయాలనే ఆలోచనతో ఐదుగురు మిత్రులం కలిసి ముందుకు వచ్చాము. అయితే మా సంకల్పానికి దాతలు తోడు కావడంతో నిర్విరామంగా నిత్య అన్నదాన కార్యక్రమం సాగుతోంది. అన్నపూర్ణేశ్వరి దయతో నిరంతరం కొనసాగించాలని భావిస్తున్నాం.

– బగాది భాస్కరరావు, పూజారిపేట, ఆమదాలవలస

ఆనందంగా ఉంది



పేదవాడి ఆకలి తీర్చడంలోనే ఆనందం ఉంది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని భావించాం. ముందుగా మేము కొంత మొత్తాన్ని వెచ్చించి నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించాం. ఈ విషయంలో చాలా సంతోషంగా ఉన్నాము. నిత్యం కొనసాగించాలని భావిస్తున్నాం.

– దుంపల శ్యామలరావు, ఆమదాలవలస



ఏడాది పూర్తయిన సందర్భంగా పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

నిబంధనలకు తూట్లు..

దర్జాగా వాటాలు!

- అరసవల్లి ఆదిత్యాలయంలో వెలుగు చూస్తున్న అక్రమాలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక చక్రం తిప్పిన ఇద్దరు ఉద్యోగులు
- డిప్యుటేషన్ ఉద్యోగికి రెండేళ్ల ఎరియర్స్‌తో పీఆర్సీ చెల్లింపు
- ఎరియర్స్ సొమ్మును వాటాలేసుకున్న వైనం
- విజిలెన్స్‌కు చేరిన ఫిర్యాదులు



అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం

అరసవల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరు అధికారులు బరితెగిస్తున్నారు. ఏకంగా నిబంధనలను తుంగలోకి తొక్కి తమ వారికి అక్రమంగా లబ్ధి చేకూరేలా చర్యలకు దిగుతున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఇలాంటి బాగోతం హాట్‌టాపిక్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ జగన్నాథ స్వామి వారి ఆలయంలో అటెండర్‌గా పనిచేసిన పి.శ్రీనివాసరావుకు రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయానికి బదిలీ అయ్యారు. అక్కడి ఆలయంలో ఆర్థిక పరిస్థితులు బాగోలేక జీతాలు సక్రమంగా రావడం లేదన్న సాకుతో 2022లోనే అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి డిప్యుటేషన్‌పై అటెండర్‌గా విధుల్లో చేరారు. అయితే 2022 పీఆర్సీ పొందేందుకు శ్రీనివాస్ ప్రయత్నం చేసినప్పటికీ జీవో 888 నిబంధనల ప్రకారం డిప్యుటేషన్ ఉద్యోగులకు ఆలయం తరపున పీఆర్సీని పొందే అవకాశాలు లేవు. దీంతో గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా పోయింది. అయితే కూటమి ప్రభుత్వం రాగానే కొత్తగా వచ్చిన ఈవోతో పాటు నిన్నమొన్నటి వరకు రాష్ట్ర కమిషనర్‌గా పనిచేసిన, అధికారి బంధువంటూ ఆధిపత్యం చెలాయిస్తున్న ఓ రిటైర్డ్ ఉద్యోగి కలిసి అటెండర్ శ్రీనివాస్‌కు పీఆర్సీని అమలు చేయించారు. దీంతో ఒక్కసారిగా సదరు అటెండర్ జీతం రెట్టింపు అవ్వడంతో పాటు 2022 ఆగస్టు 1 నుంచి 2024 ఆగస్టు 31 వరకు అంటే రెండేళ్ల పాటు పీఆర్సీ ఎరియర్స్‌గా రూ.5.72 లక్షల వరకు నగదు అటెండర్ శ్రీనివాస్‌కు జమ అయ్యేలా చక్రం తిప్పి సఫలమయ్యారు.

రికవరీకి సన్నాహాలు..

అటెండర్‌కు అక్రమంగా పీఆర్సీ దక్కడంపై ప్రస్తుత ఈవో వై.భద్రాజీ సదరు ఉద్యోగి నుంచి రికవరీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. విజిలెన్స్ అధికారులు కూడా విచారణ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది.

ముందే ఒప్పందం..

'రూల్ ప్రకారం పీఆర్సీ వర్తించకపోయినా కమిషనర్ మా బంధువు కాబట్టి ఈవో మీ కులానికి చెందిన వారు కావడంతో నీ పని చేసేస్తా. అందుకు ప్రతిఫలంగా రెండేళ్ల ఎరియర్స్ మొత్తాన్ని మాకిచ్చేయాలి. కొత్త పీఆర్సీతో వస్తున్న రెట్టింపు జీతం నీదే..'' ఇదే చీకటి ఒప్పందంతో అప్పటి ఈవో ఓ రిటైర్డ్ ఉద్యోగి కలిసి అటెండర్ శ్రీనివాస్‌కు మేలు చేసినట్టే చేస్తూ ఎరియర్స్‌ను వాటాలేసుకున్నారనే చర్చ జోరందుకుంది.

ఖజానాకు గండి..!

ఇప్పటికే ఆదిత్యాలయ బడ్జెట్ ఖాతాలు ఖాళీలయ్యాయి. నిధుల లేమి కారణంగా ఆవు గడ్డి మొదలుకొని అధికారిక వాహనం పెట్రోల్ వినియోగం వరకు బకాయిలు పడిన సంగతి తెలిసిందే. దీనికి తోడు ఆలయానికి చెందని ఉద్యోగులు, డిప్యుటేషన్ ఉద్యోగులకు అక్రమంగా పీఆర్సీ అమలు, ఎరియర్స్ చెల్లింపులు, రెట్టింపైన జీతాలు చెల్లింపులు ఆలయ బడ్జెట్‌పై తీవ్రం భారం చూపుతున్నాయి. వివిధ హోదా గల దేవాలయాల నుంచి ఇటీవలే బదిలీలపై వచ్చిన ఇద్దరు ముగ్గురు ఉద్యోగులకు రూ.లక్షల్లో జీతాలు ఆలయం నుంచి చెల్లింపులు చేయాల్సివస్తోంది. ఇలాంటి కారణాలతో ఆదిత్యాలయ ఆదాయ ఖజానాకు గండిపడుతోందని స్థానిక భక్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పథకాలు సరే.. ఫీజు రీయింబర్స్‌మెంట్ మాటేంటి?

- సూపర్‌సిక్స్ పథకాలపై సీఎం ప్రకటనతో విద్యార్థుల్లో ఆందోళన
- ఫీజు చెల్లింపు నోటీసులకు సిద్ధమవుతున్న కళాశాలలు

టెక్కలి: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సక్రమంగా లేదంటూ గత ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేస్తూ సూపర్ సిక్స్ పథకాలు ఇవ్వలేమంటూ సీఎం చంద్రబాబు తాజాగా చేసిన ప్రకటన సామాన్యులతో పాటు విద్యార్థులనూ కలవరపాటుకు గురి చేస్తోంది. ఆర్థిక పరిస్థితుల నెపంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి ఎక్కడ మంగళం పాడేస్తారోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఇంజినీరింగ్ కళాశాలలకు ఐదు క్వార్టర్లీ మేరకు ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల బకాయిలు ఉన్నాయి. అయినా ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో ఫీజులు వసూలు విషయంలో కొన్ని కళాశాలలు విద్యార్థులకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలకు ఇప్పటి వరకు 5 క్వార్టర్లీకు మూడు వేల మందికిపైగా విద్యార్థులకు సంబంధించి సుమారు రూ.30 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు అందాల్సి ఉంది. ఒక్క కళాశాలలోనే పరిస్థితి ఇలా ఉంటే జిల్లా వ్యాప్తంగా ఉన్న మిగిలిన కళాశాలలో ఇంకెంత మేర బకాయిలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా విద్యాదీవెన కింద సుమారు 51,150 మందికి, వసతి దీవెన పథకం కింద సుమారు 50,700 మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేయాల్సి ఉంది.

ప్రభుత్వం స్పందించాలి..



కళాశాల నుంచి ఎటువంటి ఇబ్బందులు లేక మునుపే ప్రభుత్వం స్పందించాలి. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి నిధులు విడుదల చేయాలి.

– డి.ఉమామహేశ్వరరావు, బీటెక్ ఫైనలియర్, టెక్కలి

నిధులు విడుదల చేయాలి..



ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై ఆధారపడి ఎంతో మంది పేద, సామాన్య వర్గాల విద్యార్థులు చదువుతున్నారు. తక్షణమే పెండింగ్ నిధులు విడుదల చేయాలి. – యు.దుర్గాప్రసాద్, విద్యార్థి సంఘం నాయకుడు, టెక్కలి

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



దగ్ధమవుతున్న ద్విచక్రవాహనం

ఆమదాలవలస: పట్టణ శివారులోని లక్ష్మణరాజు పెట్రోల్ బంక్ వద్ద బుధవారం ద్విచక్ర వాహనం నుంచి మంటలు వచ్చి వాహనం దగ్ధమయ్యింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సరుబుజ్జిలి మండలం కొండవలస గ్రామానికి చెందిన అల్లాడ రాజు తన ద్విచక్ర వాహనానికి పెట్రోల్ కొట్టించుకొని బైక్‌ను స్టార్ట్ చేస్తున్న తరుణంలో ట్యాంక్ నుంచి మంటలు వచ్చాయి. ఇది గమనించిన బంక్ సిబ్బంది సాహసం చేసి, బంక్ నుంచి సుమారు పది అడుగుల దూరం వరకు బైక్‌ను తీసుకెళ్లి అక్కడ విడిచిపెట్టారు. వెంటనే బైక్‌ను స్టాండ్ వేసి దూరం వెళ్లిపోయారు. అనంతరం పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న సిబ్బంది, స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయినా మంటలు ఆగకపోవడంతో పెట్రోల్ బంక్‌లోని మంటలు అదుపు చేసే గ్యాస్‌ను తీసుకొచ్చి స్ప్రే చేశారు. దీంతో మంటలు ఆగాయి. అయితే సిబ్బంది అప్రమత్తంగా లేకుంటే పెట్రోల్ బంక్‌లో పెను ప్రమాదం జరిగేదని స్థానికులు పేర్కొన్నారు. ఒక్క క్షణంలో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నూతన కార్యవర్గం నియామకం



తూర్పుకాపు ఉద్యోగుల రాష్ట్ర సంఘం నాయకులు

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉద్యోగ విభాగ కార్యవర్గాన్ని నియమించినట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలోని తూర్పుకాపు సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం నియామక పత్రాలను అందించారు. రాష్ట్ర ఉద్యోగ విభాగ గౌరవ అధ్యక్షుడిగా సలాన చిరంజీవి, రాష్ట్ర అధ్యక్షుడిగా బలగ మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బోనంగి తిరుపతిరావు, పోలాకి మోహనరావు, ఎర్నేన మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా రట్టి శ్యామసుందర్, వాడవలస సురేష్ కుమార్, కోట నరసింహనాయుడు, రాష్ట్ర కార్యదర్శులుగా మహంతి సుబ్బారావు, మూడడ్ల ప్రసాద్, పిల్లా రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా చింతల రామకృష్ణ, గంటాడ సుజాత, రాష్ట్ర కోశాధికారిగా బొడ్డపాటి బాబురావులు ఎన్నికైనట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. తూర్పుకాపు ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం పనిచేయాలన్నారు. సంఘ పెద్దల సూచనల మేరకు ఎటువంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుమ్మడి శాంతారావు, జిల్లా నాయకులు తాటిరాజ్ కూర్మారావు, పాలవలస ఢిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి రాష్ట్రస్థాయి నాటిక పోటీలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న కళానికేతన్ కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: కళాసేవలోనే ముత్యాలమ్మ కళానికేతన్ పనిచేస్తుందని సంస్థ నిర్వాహక కార్యదర్శి కేశిరెడ్డి రాజేశ్వరి అన్నారు. జిల్లా కేంద్రంలోని గుజరాతిపేటలో నాటిక పరిషత్–2025 పోటీల కరపత్రం బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పి.కె.ఎంటర్‌టైన్‌మెంట్ సహకారంతో ఈ నెల 9నుంచి మూడు రోజులు బాపుజీ కళామందిర్‌లో నాటిక పోటీలు జరుగుతాయని చెప్పారు. 9న స్వేచ్ఛ(హైదరాబాద్), జనగరల్ బోగీలు(కొలకలూరు), 10న చిగురు మేఘం(గుంటూరు), బ్రహ్మ స్వరూపం(విజయవాడ), 11న నిశ్శబ్దం నీ ఖరీదెంత(విశాఖ), దేవరాగం(ఉత్తరాంధ్ర) నాటిక ప్రదర్శనలు జరుగుతాయని రాజేశ్వరి తెలిపారు. సమావేశంలో కళా పరిషత్ నిర్వాహక కమిటీ సభ్యులు కేశిరెడ్డి శ్యామ్‌కుమార్, కె.శాంతారామ్, రఘుపాత్రుని శ్రీకాంత్, బత్తుల జ్యోతి, పి.కె.ఎంటర్‌టైన్‌మెంట్ ప్రతినిధులు రొక్కం భాస్కరరావు, కీర్తి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నాలుగున్నర తులాల బంగారం చోరీ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో బుధవారం నాలుగున్నర తులాల బంగారం చోరీకి గురయ్యింది. ఒక ఇంటి యజమాని తాళం వేసి బయటకు వెళ్లి, గంటన్నర వ్యవధిలో మళ్లీ ఇంటికొచ్చినంత సమయంలో బంగారం, రూ.21 వేల నగదు చోరీకి గురయ్యాయి. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పిలి వెంకటరత్నం అనే మహిళ జిల్లా పరిషత్ ఎదురుగా పండ్ల దుకాణం నడుపుతూ తన కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఈమె ఏపీహెచ్‌బీకాలనీలో అంబేడ్కర్ భవన్ ఎదురుగా కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటోంది. బుధవారం ఉదయం ఎప్పటిలాగే పండ్ల దుకాణానికి వెళ్లిన ఈమె సాయంత్రం ఇంటికొచ్చింది. మరలా సాయంత్రం ఐదు గంటలకు దుకాణానికి వెళ్లి, 6:30 గంటల ప్రాంతంలో ఇంటికొచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువా తలుపులు కూడా తీసి ఉండడంతో ఆందోళనకు గురైన ఆమె చూసేసరికి అందులో నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురవ్వడంతో లబోదిబోమంది. స్థానికుల సాయంతో ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, క్లూస్ టీమ్‌తో వచ్చిన ఎస్‌ఐ హరికృష్ణ చుట్టుపక్కల పరిసరాలను నిశితంగా పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వన్‌స్టాప్‌తో వేధింపులకు ఫుల్‌స్టాప్



వన్‌స్టాప్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పరువు, పేదరికం, నిరక్షరాస్యత వంటి కారణాలతో దిక్కుతోచని స్థితిలో ఉన్న మహిళలకు వన్ స్టాప్ సెంటర్లు భరోసానిస్తున్నాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. రిమ్స్ ఆస్పత్రిలో ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ సిబ్బందితో మాట్లాడారు. ఈ కేంద్రాలతో మహిళలపై వేధింపులకు ఫుల్‌స్టాప్ పడుతుందన్నారు. బాధిత మహిళలకు ఆశ్రయం కల్పించడంతో పాటు న్యాయ సహాయం, కౌన్సిలింగ్ ఇస్తూ అండగా నిలవడం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సెంటర్లలో 18 ఏళ్లలోపు బాలికలు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న మహిళలకు వారి అవసరాన్ని బట్టి సహకారం అందిస్తారని, ఏమైనా సమస్య వస్తే బాధితులు నేరుగా సెంటర్‌కు వెళ్లవచ్చన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సహకారంతో సైతం ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

థర్మల్ పవర్ ప్లాంట్ ఆపాలి



జేసీకి వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గిరిజన గ్రామాలున్న ప్రాంతాల్లో పర్యావరణాన్ని నాశనం చేసే థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనలు ఆపాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో వైఎస్సార్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం బుధవారం అందించారు. టీడీపీ ప్రభుత్వం ఆదివాసీలను నాశనం చేయాలని చూస్తే ఊరుకోమని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

పశునష్ట పరిహారం జమ

- జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ రాజగోపాల్‌రావు



మాట్లాడుతున్న జేడీ డాక్టర్ రాజగోపాల్‌రావు

పాతపట్నం: జిల్లాలో పశునష్ట పరిహార పథకం ద్వారా పాడి రైతుల ఖాతాల్లో రూ.13,42,52,500 కోట్లు జమ చేసినట్లు జిల్లా పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ కె.రాజగోపాల్‌రావు అన్నారు. పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో జరుగుతున్న పశు ఆరోగ్య శిబిరాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 4,553 ఆవుజాతి పాడి పశువులకు, 176 గేదె జాతి, 1,142 గొర్రెలు, మేకలకు నష్ట పరిహార పథకం ద్వారా నిధులు పాడి రైతుల ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందన్నారు. పశువైద్య శిబిరాల ద్వారా 18,826 మంది పశు పోషకులకు లబ్ధి కలిగిందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేస్తున్న పశుగ్రాసాల వైపు పాడి రైతులంతా దృష్టి సారించాలని సూచించారు. మినీ గోకులం నిర్మాణాలు ఎవరైతే 20 రోజుల్లో పూర్తి చేస్తామని లిఖిత పూర్వకంగా వస్తారో, వారికి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆయనతో పాటు జిల్లా సమగ్ర గొర్రెల అభివృద్ధి పథకం సహాయ సంచాలకుడు డాక్టర్ యోగి, టెక్కలి డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ వి.జయరాజు, డాక్టర్ మంచు కరుణాకరరావు, పశుగణాభివృద్ధి సంస్థ వైద్యురాలు రాధాకుమారి, పశు వైద్యుడు పి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నాటుసారాతో ఎక్సైజ్ అధికారులు

సోంపేట: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం దాడులు నిర్వహించి మందస మండలంలోని గుడ్డికోల, బుడారసింగి గ్రామాల్లో 1,900 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు సీఐ కె.బేబి తెలిపారు. అదే గ్రామాల పరిధిలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి, 95 లీటర్ల నాటుసారా, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో సోంపేట, శ్రీకాకుళం టీమ్‌లు పాల్గొన్నాయి.